ఆంధ్రజ్యోతి
Happy Sankranthi
ANDHRAJYOTHY
కరీంనగర్
5 జిల్లా వార్తలు
మంగళవారం 14 జనవరి 2025





కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు నారదాసు లక్ష్మణ్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్‌తో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి



నేడు మకర సంక్రాంతి

8లో..



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తున్న అంబులెన్స్

కరీంనగర్ వన్ టౌన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ ఎమ్మెల్యే

పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని కరీంనగర్‌కు తరలించిన పోలీసులు
- వన్‌టౌన్ ఎదుట బీఆర్ఎస్ నేతల నిరసనలు
- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం అరెస్టు చేశారు. కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ వన్‌టౌన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు మధ్యాహ్నం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. రాత్రి హైదరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసి రాత్రి 10.40కి కరీంనగర్‌కు తీసుకొ చ్చారు. ఆయన అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున వన్ టౌన్ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 11.45 కు కౌశిక్ రెడ్డిని కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్/ క్రైం

6

పాడి కౌశిక్‌రెడ్డిపై కేసులు బేషరతుగా ఎత్తివేయాలి

- మాజీ మంత్రి గంగుల కమలాకర్

భగత్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ శాసన సభ్యుడు కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కరీం నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన సంఘటనపై రాష్ట్రానికి చెందిన ముగ్గురు మంత్రులు బాధ్యత వహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కలెక్టరేట్‌లో జరి గిన సమీక్ష సమావేశం పూర్తిగా మంత్రుల ఆజమాయిషిలో జరగాల్సిన సమావేశంలో పోలీసులు ఒక ఎమ్మెల్యేను లాక్కె ళుతుంటే ఆపాల్సిన మంత్రులు ఏం మాట్లాడకుండా ఉన్నార న్నారు. ఎమ్మెల్యేపై జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరసర్పర ఆరోపణలు చేసుకున్నా ఏక పక్షంగా పోలీసులు పాడి కౌశికొరెడ్డిని లాక్కెళ్లారని విమర్శిం చారు. చట్ట సభల ప్రతినిధులపై ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ప్రజా సమస్యలపై చర్చిం చాల్సిన సమావేశానికి ప్రభుత్వ ఆహ్వానం మేరకు వెళ్లామ న్నారు. రేషన్ కార్డులు అందించి ఇందిరమ్మ ఇళ్లను అందివ్వా లన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే పేదలపై పర్మిషన్ల భారం పడకుండా చూడాలన్నారు. ఉపాధి కూలీలు 20 రోజులు పనిచేస్తే 12 వేలు ఇస్తామన్నారని, గ్రామాల్లో ఉపాధిహామి కూలీకి వెళ్లకుండా చాలా మంది ఉంటార న్నారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో అర్హులైన కూలీలందరికి 12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లపై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, వాటన్నింటిపై వివరణ ఇవ్వాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

సుభాష్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హాస్టల్స్ సంక్షేమ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్ టీఎన్‌జీవోస్ భవన్‌లో జిల్లా వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌస్‌హష్మి, దారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ సంద ర్భంగా దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ తిమ్మాపూర్ బాలిలక వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురికాగా సంబంధిత అధి కారులు, సిబ్బంది సకాలంలో పిల్లలను జిల్లా ఆసుపత్రికి తరలించారని తెలి పారు. సకాలంలో వారికి వైద్యం అందిం చడంతో ఎలాంటి ప్రాణా పాయం జరగ లేదని, కొంతమంది తమ రాజ కీయ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తూ, ఉద్యోగులను బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. వసతి గృహ ఉద్యోగులు హాస్టల్లో విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకుంటారని, కేవలం బయటి శక్తులు దీనిని చిలు వలు పలువలుగా చేస్తూ ఉద్యోగులను బద్నాం చేస్తున్నారన్నారు. వారి సమ స్యలను టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం గజదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం నాయకుడు గూడ ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, మల్కా రాజేశ్వర్‌రావు, బోనాల రవి, తిరుపతిరెడ్డి, విజయ్‌పాల్ రెడ్డి, సత్యం, శైలజ, శారద, రేవా, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులపై కత్తితో దాడి

● నిందితుడి అరెస్ట్

ధర్మపురి జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో కొసరి సత్తయ్య, అతని కొడుకు కానిస్టేబుల్ కొసరి రాకేష్‌పై అదే గ్రామానికి చెందిన లెక్కల శ్రీనివాస్ ఆదివారం రాత్రి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఉదయ్ కుమార్ కథనం ప్రకారం గ్రామంలో కొసరి సత్తయ్య, లెక్కల శ్రీనివాస్ మధ్య గ్రామపంచాయతీ వద్ద గొడవ జరిగింది. అనంతరం శ్రీనివాస్ తన ఇంటికి వెళ్లి రెండు కత్తులు తీసుకొచ్చి సత్తయ్య ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన సత్తయ్య కొడుకు కొసరి రాకేష్‌ను కూడ కత్తులతో పొడవడంతో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని హుటాహుటిన జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి గాయపడిన తండ్రీ కొడుకులను పరామర్శించి, పూర్తి సమాచారం సేకరించారు. రాకేష్ భార్య దివ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు

కోరుట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జవహర్ రోడ్డులో విద్యుదాఘాతంతో సోమవారం బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. జవహర్ రోడ్డులో నివాసం ఉంటున్న రాజు-లావణ్య దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. చిన్న కుమారుడు అరియన్ (7) భవనంపై గాలి పటం ఎగురవేయడానికి మెట్లపై నుంచి పైకి వెళ్తుండగా పక్కన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి గాయపడిన అరియన్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జగిత్యాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సై

మల్యాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట శివారులో మహిళా రైతు వెల్మ సుగుణమ్మ మెడలో నుంచి గొలుసు అపహరణకు యత్నించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. సీఐ, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి రాజేశం, శివరాత్రి జగన్ అనే వ్యక్తులు ఆదివారం పంట చేల వద్ద గల సుగుణమ్మ మెడలో నుంచి గొలుసు అపహరణకు యత్నించారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేశారు. సోమవారం ఎస్సారెస్పీ కాలువ వద్ద నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల వద్ద ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో సోమవారం రాత్రి కొమిరే తిరుపతి అనే కల్లు గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కగా, ప్రమాదవశాత్తు మోకు జారడంతో చెట్టుపై నుంచి కింద ఉన్న పొలంలో పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు తరలించారు.

రైతు వేదికలో చోరీకి యత్నం

శంకరపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. స్థానికుల సమాచారం మేరకు కేశవపట్నం రైతు వేదికలో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి సీసీ కెమెరా విరిచి, స్పీకర్లను ఎత్తుకెళ్లేందుకు వాటికున్న వైర్లను తొలగించి కవర్లో పెట్టి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా, స్థానికుల శబ్ధంతో అక్కడి నుంచి దుండగులు వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత ఏఈవో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత

గంభీరావుపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి శివారులో సోమవారం 100 కిలోల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. కొత్తపల్లికి చెందిన శ్రీనివాస్, రాజుపేటకు చెందిన స్వామి ద్విచక్ర వాహనంపై పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. 100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని, రవాణా చేస్తున్న స్కూటీని సీజ్ చేసినట్లు, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంపై పోలీసులకు ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తన భర్త మృతిచెందాడని ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్ భాగ్యనగర్‌కు చెందిన న్యాయవాది మాదరి అశోక్ అస్వస్థతకు గురికాగా ఆయనను శనివారం రాత్రి 2:30 గంటలకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు నిర్లక్ష్యంగా సరైన వైద్య పరీక్షలు చేయకుండానే ఆరోగ్యంగా ఉన్నాడని ఒక రోజు తరువాత ఇంటికి పంపించారు. వైద్యులు నిర్లక్ష్యంతో తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు

కరీంనగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/క్రైం, జనవరి 13: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్‌లో అరెస్టు చేశారు. కరీంనగర్ వన్‌టౌన్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఆది, సోమవారాల్లో నాలుగు కేసులు నమోదయ్యాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతుండగా హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అడ్డుకుని దాడికి యత్నించి నెట్టేశాడని సంజయ్‌కుమార్ పీఏ వినోద్ అదే రోజు రాత్రి కరీంనగర్ వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య, ఆర్డీవో కె మహేశ్వర్, సుడా చైర్మన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కౌశిక్‌రెడ్డిపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ కేసులే కాకుండా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అసెంబ్లీ స్పీకర్‌ను కలిసి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ పోలీసులు కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం అరెస్టు చేసి కరీంనగర్‌కు తరలించారు. రాత్రి 10.40 నిమిషాలకు కరీంనగర్ చేరుకున్నారు. ఆయనను కరీంనగర్ సీపీటీసీ (సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్)లో ఉంచారు.

వన్‌టౌన్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకువస్తున్నట్లు సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉన్న వారందరూ పార్టీ కార్యాలయం వద్దకు రావాలని సందేశాలు సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు వన్‌టౌన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కౌశిక్‌రెడ్డిని ఎక్కడ ఉంచారు. ఎప్పుడు కోర్టులో హాజరు పరుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో అరాచకం నడుస్తోందని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక ప్రజాప్రతినిధిని అరెస్టు చేయడం అమానుష చర్య అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు పెద్ద రభస చేశారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరి శంకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

త్రీటౌన్‌కు తరలింపు

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనందున ఆయనను అక్కడికే తీసుకొస్తారని అందరూ ఎదురు చూశారు. మీడియా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రాత్రి 11.45 గంటల సమయంలో కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు, బీఆర్ ఎస్ నాయ కులు అక్కడికి వెళ్లారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌశిక్ రెడ్డిని పోలీసులు ప్రాథమికంగా విచారిస్తున్నట్టు తెలి సింది.


బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు

త్రీటౌన్ లోపలికి పోలీసు అధికారులు ఒక బెడ్ ను పంపించారు. స్టేషన్ లోపలికి బీఆర్ఎస్ నాయకులు, న్యాయవాదులైన మాజీ ఎమెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌ను అనుమతించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు అంబులెన్స్‌ను తెప్పించారు. పోలీస్‌స్టేషన్‌లోనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

● రిమాండ్‌కు తరలిస్తామన్నారు..

- సర్దార్ రవీందర్‌సింగ్

స్టేషన్ నుంచి బయటకు వచ్చిన సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ తాము 41 సీఆర్‌పీసీ గురించి అడిగామని, పోలీసులు ఒప్పుకోలేదన్నారు. రిమాండ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారన్నారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని, ఏ క్షణమైనా ఆయనను తరలించే అవకాశం ఉందని తెలిపారు.

కౌశిక్‌రెడ్డికి నా గురించి మాట్లాడే అర్హత లేదు

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తన గురించి మాట్లాడే అర్హత లేదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. తనపై దాడికి యత్నించిన కౌశిక్‌రెడ్డిపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం డాక్టర్ సంజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. తనను కౌశిక్‌రెడ్డి చేయితో నెట్టివేశాడని, అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. ఇది ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తాను ఎపుడు కూడా ఏ వ్యక్తిని దూషించలేదని అన్నారు. తాను ప్రజా సమస్యలపై మాట్లాడాలని అనుకుంటే ఆయన ఆటంకం కలిగించాడని అన్నారు. జగిత్యాల అభివృద్ధి కోసమే తనను గెలిపించారని, అభివృద్ధి చేయడం తన బాధ్యత అని అన్నారు. కౌశిక్‌రెడ్డి దురుసుగా ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీతో పనిచేస్తే ఇంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. తనకు అండగా నిలిచిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాంగ్మూలం తీసుకున్న పోలీసులు

పోలీసు అధికారులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వాంగ్మూలాన్ని సోమవారం రికార్డు చేశారు. ఎమ్మెల్యే కరీంనగర్ పోలీసు ఠాణాకు వస్తున్నట్లు సమాచారం అందుకున్న జగిత్యాల కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్యే అనుచరులు భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాంగ్మూలం రికార్డు చేసిన తరువాత ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అక్కడ పరీక్షలు చేసుకుని జగిత్యాలకు వెళ్లిపోయారు.

అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించారంటూ సోమవారం హైద్రాబాద్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. గత రెండు రోజుల క్రితం కరీంనగర్‌లో అభివృద్ధిపై జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశానికి హాజరై ప్రసంగించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఏ పార్టీ నీదంటూ.. తనపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఫిర్యాదు పత్రం అందించారు. సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ జరిపిస్తానని తెలిపారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వివరించారు.


స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

● భార్య, మరో ఇద్దరికి తీవ్రగాయాలు ● ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కోల్‌సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరాల్సిన ప్రాణాలు రోడ్డు ప్రమాదంలో గాలిలో కలిశాయి. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందడం... మరో ముగ్గురు గాయాలపాలవడం గోదావరిఖనిలో విషాదం నింపింది. గోదావరిఖని మెయిన్ రోడ్డులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం తెల్లవారుజామున చీకట్లో పార్కింగ్ చేసి ఉన్న ఉప్పు బస్తాల లోడ్ లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి గిన్నారపు సతీష్(32), తన 11నెలల కుమారుడు నవీస్ మృతి చెందాడు. భార్య గిన్నారపు కీర్తి, అతని సోదరి అనూష, బావ ఆత్కురి సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలు.. గిన్నారపు సతీష్ దగ్గరి బంధువు, సోదరుడైన కిన్నెర చందుకు పాప పుట్టడంతో గిన్నారపు సతీష్, అతని భార్య కీర్తి, కుమారు నవీష్, ఫైటింక్లయిన్‌కాలనీకి చెందిన సతీష్ సోదరి అనూష, అతని బావ సింగరేణి ఉద్యోగి ఆత్కూరి సతీష్ కారు నంబర్ టీఎస్ 09ఈజీ5454లో ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లారు. రాత్రి 11గంటలకు హైదరాబాద్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. కారును గిన్నారపు సతీష్ నడుపుతుండగా ముందు సీట్లో అతని బావ సతీష్, వెనుక సీట్లో తన భార్య, సోదరి, కుమారుడు ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు గోదావరిఖని పట్టణానికి చేరుకున్న కారు మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరాల్సి ఉంది.

● కుక్కను తప్పించబోయి

గోదావరిఖని మెయిన్ రోడ్డుపై పార్కింగ్ లైట్లు వేయకుండా ఉప్పు బస్తాల లారీని పార్కింగ్ చేశారు. మున్సిపల్ జంక్షన్ నుంచి మెయిన్ చౌరస్తా వైపు వెళుతున్న కారుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కుక్క అకస్మాత్తుగా అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి చీకట్లో పార్కింగ్ చేసిన లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారును డ్రైవింగ్ చేస్తున్న గిన్నారపు సతీష్, అతని కుమారుడు నవీష్ మృతి చెందారు. భార్య కీర్తి, సోదరి అనూష, బావ సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన గిన్నారపు సతీష్ డీజే, బ్యాండ్ నిర్వాహకుడిగా సుపరిచితుడు. అతనికి ఒక పాప, ఇద్దరు కుమారులు కాగా రోడ్డు ప్రమాదంలో 11నెలల చిన్న కుమారుడు మృతి చెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుపై పార్కింగ్ లైట్లు వేయకుండా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.


గోదావరిఖనిలో లారీని వెనకనుంచి ఢీకొన్న కారు


సతీష్(ఫైల్)


నవీష్ (ఫైల్)

● గ్రామంలో విషాదం

తిమ్మాపూర్: పోరండ్ల గ్రామానికి చెందిన సతీష్ గోదావరిఖనిలోని సింగరేణి లెవన్ ఇంక్లైన్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ అక్కడే అంబేద్కర్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. సతీష్, అతని కుమారుడు నవీష్ మృతదేహాలను పోరండ్ల గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో గ్రామంలో విసాదఛాయలు నెలకొన్నాయి. మృతుడు సతీష్ తండ్రి మృతి చెందగా తండ్రి ఉద్యోగంతో మూడు నెలల క్రితమే ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. కుటుంబానికి అండగా ఉన్న సతీష్ మృతి చెందడంతో వారి పరిస్థితి దీనంగా మారింది.

మల్లన్నస్వామి ఆలయంలో బోనాల సందడి

మంథని, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్‌లోని శ్రీ చెన్న పర్వతాల మల్లన్న స్వామి దేవాలయంలో భక్తులు సోమవారం బోనాల వేడుకలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు పసుపు బండారి, డోలు వాయిద్యాల మధ్య శ్రీ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించగా వార్డులోని మహిళలంతా స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న స్వామి బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భగత్‌నగర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాలు

మంథనిరూరల్: మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారి నైవేద్యంగా సమర్పించారు. ఒగ్గు కళాకారులు పట్నాలు వేసి పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐలి ప్రసాద్, ఆరెల్లి కిరణ్‌గౌడ్, పేరవేన లింగయ్య, మాచీడి రాము, గ్రామస్థులు, భక్తులుపాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టేనా..!

● వారం రోజులు గడిచినా విధుల్లో చేరని కొండగట్టు ఈవో

మల్యాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా వారం రోజుల క్రితం నియమితులైన శ్రీకాంత్‌రావు ఇంత వరకు బాధ్యతలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ విధులు నిర్వహించిన ఈవో రామకృష్ణరావును హైదరాబాద్‌లోని గణేష్ ఆలయానికి ఈ నెల మొదట్లో బదిలీ చేసి ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో కొండగట్టు నుంచి రామకృష్ణరావు రిలీవ్ కాగ ఆయన స్థానంలో వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావును నియమించారు. ఉత్తర్వులు అందకపోవడంతో ఈ నెల 3న వినోద్ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో మళ్లీ ఈ నెల 7న మరోసారి శ్రీకాంత్‌రావును కొండగట్టు ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో శ్రీకాంత్‌రావు విధుల్లో చేరుతారని అనుకున్నారు. వారం రోజులు గడిచినా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. వేములవాడ ఈవోగా అక్కడి బాధ్యతలు ఎక్కువగా ఉండడంతో కొండగట్టులో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి నెలకొన్నట్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే.. శ్రీకాంత్‌రావు ఈవోగా బాధ్యతలు చేపట్టడం అనుమానమేననే తెలుస్తోంది. ఈయన స్థానంలో మరొకరిని నియమించే అవకాశాలు లేకపోలేదని అనుకుంటున్నారు.


● నిలిచిన కార్యకలాపాలు

ఈవోగా వేములవాడ ఈవో వినోద్ అదనపు బాధ్యతలు చేపట్టిన రోజే మరొకరిని నియమించడంతో బ్యాంకు సంబంధిత లావాదేవీలు నిలిచిపోయాయి. బ్యాంకులో అధికారుల వివరాలు మళ్లీ పొందుపరచాల్సి ఉండగా నూతనంగా మరో ఈవో నియమితులవడం, రెండు రోజుల్లోనే మళ్లీ వివరాలు అందించడం అసౌకర్యంగా మారనుండడంతో ఆ ప్రక్రియ చేపట్టలేదు. కొత్త ఈవో విధుల్లో చేరకపోవడం, ఇన్‌చార్జి ఈవో వివరాలు బ్యాంకులో నమోదు చేయకపోవడంతో కింది స్థాయి సిబ్బంది వేతనాలు, ఇతరాత్రా బకాయిలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. కార్యకలాపాలు నిలిచిపోయాయి.

ఢిల్లీ పరేడ్‌కు మెట్‌పల్లి డప్పు కళాకారులు

● భవానీ బృందానికి అరుదైన అవకాశం

శంకరపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల క్రితం కోలాటంతో ఆడుతూ.. పాడుతూ.. సరదాగా వీరి ప్రస్థానం ప్రారంభమై అనతి కాలంలోనే డప్పు కళాకారులుగా గుర్తింపు పొందారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో కళాప్రదర్శన ఇచ్చి గుర్తింపు తెచ్చుకున్నారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన మహిళా డప్పు కళాకారులు కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో డప్పు వాయిద్యంలో దేశ నలుమూలల నుంచి గుర్తింపు పొందారు. రానున్న రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని డప్పు కళాకారులు తమ ప్రదర్శన ఇవ్వనున్నారు. తెలంగాణ నుంచి 12మంది మహిళ డప్పు కళాకారులు ప్రదర్శన ఇవ్వడానికి ఢిల్లీకి వెళ్లగా అందులో శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన భవానీ మహిళా డప్పు కళాకారుల బృంద సభ్యులు ఐదుగురున్నారు. భవానీ డప్పు కళాకారుల బృందం తాము ఎవరికీ తీసిపోమనే విధంగా పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపుతో పాటు గౌరవాన్ని దక్కించుకున్నారు. నేడు జాతీయ స్థాయిలో ప్రదర్శన ఇచ్చేందుకు వెళ్లిన దాసారపు భవానీ, అంతడుపుల కోమల, మారుమల్ల రజిత, దాసారపు స్వప్న, మిడిదొడ్డి రజితలను మెట్‌పల్లి గ్రామంతో పాటు మండల ప్రజలు అభినందిస్తున్నారు.


ఢిల్లీలో దాసారపు భవాని


ఢిల్లీలో రిపబ్లిక్ డే సందర్భంగా ప్రదర్శన ఇచ్చేందుకు వెళ్లిన మెట్‌పల్లి భవానీ డప్పు కళాకారుల బృందం సభ్యులు

ముమ్మరంగా గండి పూడిక పనులు



మన్నెంపల్లి వద్ద కాలువకు మరమ్మతులు

తిమ్మాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో డి-4కాలువకు ఆదివారం గండి పడి గ్రామంలోకి నీరు వచ్చింది. ఇరిగేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. కాలువకు 9వ కిలోమీటర్ వద్ద గండి పడ్డ ప్రదేశంలో సంచుల్లో ఇసుక నింపి ఆ సంచులను కూలీలను, జేసీబీ సహాయంతో గండిని పూడ్చివేశారు. గండి పడ్డ ప్రాంతంలో మంగళవారం నాటికి పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులను ఇరిగేషన్ ఇఇ పెద్ది రమేష్, డిఇఇ సదయ్య పర్యవేక్షిస్తున్నారు.

చిత్ర లేఖనంలో పాఠాలు





విద్యార్థులు గీసిన చిత్రాలతో బాబు



- విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు
- రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు

ఇల్లంతకుంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా వ్యాయామ ఉపాధ్యాయుడైనా చిత్రలేఖనంపై ఆసక్తి. మనస్సులో కదలాడే భావాలకు అనుగుణంగా చిత్రాలు గీస్తాడు. విద్యార్థులకు ఆటలతోపాటు చిత్రలేఖనంలోనూ శిక్షణ ఇస్తున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన సాన బాబు చిన్నతనం నుంచి చిత్ర లేఖనంపై ఆసక్తి. పాఠశాలలో చదవుతున్నప్పుడే అనేక చిత్రాలు గీసి గుర్తింపు పొందాడు. గంభీరావుపేట, తంగళ్లపల్లి, సిరిసిల్లలలో పీఈటీగా పని చేస్తూ ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆటలతోపాటు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చాడు. ఉపాధ్యాయుడి శిక్షణలో వంగర కీర్తన అనే విద్యార్థిని చిత్రలేఖనంలో జాతీయస్థాయి బహుమతి అందుకుంది. రాష్ట్రస్థాయి పోటీలలో 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తాను పనిచేసిన పాఠశాలల్లో గోడలపై జాతీయ నాయకుల చిత్రాలు, సామాన్యశాస్త్ర చిత్రాలు వేసి తల్లిదండ్రుల మన్ననలు పొందాడు. ఓవైపు పాఠశాలలో ఆటలు ఆడిస్తూనే మరోవైపు విద్యార్థులకు చిత్రలేఖనంపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న బాబు ప్రస్తుతం ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.

సులభంగా నేర్చుకుంటున్న విద్యార్థులు

- సాన బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు, ఇల్లంతకుంట



పాఠశాల స్థాయిలో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తే సులభంగా చిత్రలేఖనం నేర్చుకుంటారు. పనిచేసిన ప్రతీ పాఠశాలలో అందమైన చిత్రాలు గీయడంతో మంచి గుర్తింపు లభించింది. చిత్రకారులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుంది. ప్రభుత్వం పాఠశాలలో చిత్రకళను నేర్పించే ఉపాధ్యాయులను నియమించాలి. తన దగ్గర చిత్రకళను నేర్చుకున్న విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

బీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్

గణేశ్‌నగర్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను(2025) బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తన క్యాంపు కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవే శపెట్టే సంక్షేమ పథకాలను నిజమైన లబ్ధిదారులకు చేరే వేసే విధంగా తమ వంతు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రాబోయే రోజులలో బీసీ సమాజానికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామని బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని అన్నారు. బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు .ఇట్టి కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులు షల్లెల.సుధీర్, ముదారి .ప్రవీణ్. అనిల్ కుమార్, కార్యదర్శులు ఆరే. సుమన్ గౌడ్, పూదరి రాజు గౌడ్, బోనాల రాము, రెడ్డి శ్రీనివాస్, భీమరి శ్రీనివాస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నగునూరి రమేష్ , సెక్రటరీ ఎస్ మధుసూదన్, చె న్నబోయిన కుమారస్వామి, పటెం శ్రీనివాస్, గోస్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ మాజీ చైర్మన్‌ను కలిసిన నాయకులు

వీణవంక,జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సగర సంఘం నియోజకవర్గ కార్యాలయానికి మాజీ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ రాగా, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అల్లం నారాయణతో పలు అంశాలపై చర్చించారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎరుకొండ ప్రసాద్ ఉన్నారు.

ఆపదలో ఉన్న మిత్రుడికి సాయం

వీణవంక,జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రామస్వామి కుమారుడు సాద్విక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రామస్వామితో చదువుకున్న 1989 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సాద్విక్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిత్రుడికి రూ. 50 వేల నగదును అందజేశారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



ధర్మపురిలో గోదారంగనాథుల కల్యాణం

ధర్మపురి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ఆలయం ఆవరణలో అందంగా పూలతో అలంకరణ చేసిన శేషప్ప కళావేదికపై రంగనాథుల ఉత్సవ మూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం పుణ్యాహవచనం, శ్రీ పురుషసూక్తం, లక్ష్మీసూక్తంతో అభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు గోదారంగనాథుల కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ ఉన్నారు.

మల్యాల: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకించి అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు, వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం హోమం జరిపారు. కల్యాణానికి ఆలయ అధికారులు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని పూజలు జరిపారు. ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కొండగట్టులో కల్యాణం జరుపుతున్న అర్చకులు

భక్తులకు కడుపునిండా అన్నం పెట్టాలనే తాపత్రయం

- వేములవాడలో అన్నదాన సత్రానికి రూ.45 లక్షలు విరాళం
- దాతలు ముందుకు రావాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి : ప్రభుత్వ విప్ ఆది

వేములవాడ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధికి వచ్చే భక్తులందరికీ కడుపునిండా అన్నం పెట్టాలనేది తమ తాపత్రయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని సోమవారం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. వేములవాడ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. తమ విజ్ఞప్తి మేరకు సీఎం అన్నదాన సత్రం భవన నిర్మాణానికి రూ. 35 కోట్లు మంజూరు చేశారని, జీవోను విడుదల చేశారని గుర్తు చేశారు. భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ చేపడతామని, అన్నదాన సత్రం నిరంతరం కొనసాగడానికి ట్రస్ట్‌లో ఇప్పటికే రూ. 20 కోట్లు ఉన్నాయని తెలిపారు. దాన్ని రూ. 100 కోట్లకు తీసుకెళ్లే బాధ్యత తీసుకుంటానని, జిల్లా ప్రజాప్రతినిధులు, ఈ ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు. అన్నదాన సత్రానికి తమ కటుంబ సభ్యులు, అన్నదమ్ములతో కలిసి రూ.45 లక్షల విరాళాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. తిరుపతిలో ఇచ్చినట్లుగా రైతులు బియ్యం, కూరగాయాలు విరాళంగా ఇవ్వవచ్చన్నారు. రాజన్న ఆలయానికి వచ్చి కోడె టికెట్, అభిషేకం టికెట్ తీసుకొని దర్శనం చేసుకున్నానన్నారు. తిరుపతి మాదిరిగానే ప్రత్యేక దర్శనం చేసుకోవచ్చని, టికెట్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి సహకరించాలని, వీఐపీ ప్రోటోకాల్ దర్శనం చేసుకునే వారు టికెట్ తీసుకోవాలని సూచించారు. ధర్మపురి, వేములవాడకు ఏసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, ధర్మపురి, వేములవాడ, కొండగట్టు వెళ్లే భక్తులకు వెసులుబాటుగా ఉంటుందని వివరించారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పక్కన విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి

వేములవాడ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ నుంచి వేములవాడకు రెండున్నర గంటల సమయం పడుతుందని, ఒక్క రోజు ప్లాన్ చేసుకొని వస్తే వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, నాంపల్లి దేవాలయాలను సందర్శించవచ్చని తెలిపారు. శాశ్వత అన్నదాన సత్రం ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విరాళం అందించిన వారి పేర్లు డిస్‌ప్లేలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. తన కుటుంబ సభ్యుల తరఫున రాజన్న ఆలయ అన్నదాన సత్రానికి రూ.10 లక్షల విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న తమ కులదైవమన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనం అనంతరం కొండగట్టు అంజన్నను, ధర్మపురి లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకుంటారన్నారు.

సైదాపూర్ మండలానికి చేరిన మిడ్ మానేరు నీరు

సైదాపూర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు సాగు నీరు అందించేందుకు విడుదల చేసిన మిడ్ మానేరు నీరు కాలువ ద్వారా సైదాపూర్ మండలానికి చేరుకున్నాయి. ఈ సంవత్సరం సైదాపూర్, చిగురుమా మిడి మండలాల రైతులు, నాయకులు ముందస్తుగా కాలువ పూడిక తీత, మరమ్మతు పనులు చేపట్టి మిడ్ మానేరు నీరు ముందుగానే విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. స్పందించిన మంత్రి నిధులు విడుదల చేయగా పనులు పూర్తి చేశారు. మిడ్ మానేరు నీటి విడుదలకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకు డు గుండారపు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



సైదాపూర్ వద్ద కాలువలో మిడ్‌మానేరు నీరు

భూ సమస్యలు పరిష్కారం కాక రైతుల ఇబ్బందులు

- ఆర్వోఆర్-2024 చట్టంపైనే ఆశలు

హుజూరాబాద్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధరణిలో పూర్తి స్థాయంలో భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెల్ల కాగితాలపై రాసుకుని కొనగోలు చేసిన భూములకు పట్టాలు లేకుండా ఎదురుచూస్తున్న రైతులకు తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన ఆర్వోఆర్-2024 చట్టంతో పరిష్కా రం లభించనుందనే ఆశతో ఉన్నారు. సాదాబైనామాల రూపంలో రైతులు భూములను కొనుగోలు చేసి అనుభ విస్తున్నా. వారి వద్ద సరైన రికార్డులు లేని కారణంగా ప్రభుత్వం వారిని పట్టా హక్కుదారులుగా గుర్తించడం లేదు. వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదు. అప్పట్లో భూ రికార్డుల ప్రక్షాళనలో పట్టా భూములు విక్రయించిన వారి పేర్ల మీదే కొత్త పాసు పుస్తకాలు వచ్చాయి. గతంలో వారి పూర్వీకులు విక్రయించిన భూములు, ప్రస్తుతం ఆ భూములు తమవి అంటూ వారసులు కబ్జా పెడుతున్న సందర్భాలు కూడా లేకపో లేదు.

హుజూరాబాద్ మండల వ్యాప్తంగా 19 గ్రామపంచాయతీల నుంచి 691 దరఖాస్తులు సాదాబైనామా కింద పరిష్కరించాలంటూ రైతులు అధికారులకు విన్నవించారు. కొత్త ఆర్వోఆర్-2024 ముసాయిదా బిల్లులోని సెక్షన్ 6(1) కింద ఆర్డీవో స్థాయి అధికారి విచారించి పరిష్కరించవచ్చని పేర్కొనడంతో వాటికి మోక్షం లభించనుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

‘సాగు’ బడి

- పాఠశాల ఆవరణలో సేంద్రియ కూరగాయల సాగు
- మధ్యాహ్న భోజనంలో వినియోగం



సుల్తాన్‌పూర్ పాఠశాలలో సాగుచేస్తున్న కూరగాయలు

ఎలిగేడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పోషకాలతో పాటు నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించాలనే ఆలోచనతో మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేంద్రియ ఎరువులతో కూరగాయలను పండిస్తున్నారు. సుల్తాన్‌పూర్ పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం ఉంది. అందులో సుమారు ఆరు, ఏడు గుంటల భూమిలో సేంద్రియ ఎరువులతో నాణ్యమైన కూరగాయలను పండిస్తూ మధ్యాహ్న భోజన వంటల్లో వినియోగించుకుంటున్నారు. దీంతో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారం లభిస్తోంది. ఆరేళ్లుగా విద్యార్థులు కూరగాయల మొక్కలను సంరక్షిస్తున్నారు. వంకాయ, చిక్కుడు, టమోటా, అలసంద, సోరకాయ వంటి కూరగాయలను, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, ఉల్లి, పుదీనా ఆకుకూరలను పండిస్తున్నారు. పాఠశాలలో పండించిన కూరగాయలను మధ్యాహ్న భోజన వంటకాల్లో ఉపయోగిస్తున్నారు.

సాగుపై అవగాహన కలుగుతోంది

ప్రణవి, పదోతరగతి



పాఠశాలలో కూరగాయలు పండించుకోవడం వలన వ్యవసాయంపై అవగాహన పెరుగుతోంది. అందరం కలిసి తోటలో పనిచేయడం ఆనందంగా ఉంది. సేంద్రియ ఎరువుతో పండించిన కూరగాయలు బాగున్నాయి.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం..

అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్



విద్యార్థులందరికీ సంపూర్ణ ఆరోగ్యం అనే లక్ష్యంతో కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నాం. అందుకు నావంతుగా కూరగాయల సాగుకు మొక్కల కొనుగోలు కోసం 90వేల రూపాయల వరకు ఖర్చు చేశాను.

సమాజ సేవకు ‘చిరు’సాయం

- సామాజిక మాధ్యమం వేదికగా విరాళాల సేకరణ
- ఆపన్నులకు అండగా నిలుస్తున్న ‘నీడ’ స్వచ్ఛంద సంస్థ



ఆపన్నులకు సహాయం అందిస్తున్న ‘నీడ’ నిర్వాహకులు

కోల్‌సిటీటౌన్, జనవరి 13 (ఆంధ్ర జ్యోతి): ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న.. అన్న పెద్దల మాట ఆ యువకుడికి స్ఫూర్తినిచ్చింది. సమాజానికి ఏదైనా సేవచేయాలన్న సంకల్పం అతడిలో కొత్త ఆలోచన కలిగించింది. తనలాంటి ఉదారగుణం కలిగిన వారికి వాట్సాప్ గ్రూప్ వేదికయ్యింది.. చేయిచేయి కలిపి అభాగ్యులకు సాయం చేసేందుకు ‘నీడ స్వచ్ఛంద సంస్థ’ ఏర్పాటు చేశారు. నెలకు తలా రూ.100 విరాళాలు సేకరిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ‘నీడ’ స్వచ్ఛంద సంస్థ రూ.100తో మొదలై.. నేడు ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలబడుతున్నది. సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని ఉన్నా సమయం సహకరించక సహాయం చేయలేకపోతుంటారు. అలాంటి వారిని సమాజ సేవలో భాగస్వాములను చేయాలన్న సంకల్పంతో నీడ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పల్లెర్ల రమేష్ రూ.100తో ప్రతినెల సమాజం కోసం అని వాట్సాప్‌లో ఒక గ్రూప్‌ను సంవత్సరం క్రితం ఏర్పాటు చేశాడు. తొలుత 10 మంది సభ్యులతో మొదలైన సంస్థలో ఇప్పుడు 80 మందికిపైగా సభ్యులుగా చేరారు. వాట్సాప్ గ్రూప్‌లోని ప్రతి ఒక్క సభ్యుడు నెలకు రూ. 100 విరాళంగా అందజేస్తున్నారు. అలా పోగైన డబ్బులను నిరుపేద డయాలసిస్ పేషెంట్లకు, పోషకాహారం అందించడం, విద్యార్థులకు చదువుకు చేయూతనివ్వడం, ప్రమాదానికి గురైన వారికి ఆర్థిక సహాయం అందించడం, క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం, నిరుపేద రోగులకు ఆర్థిక సాయం అందించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతినెలా రెండు సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురి ప్రశంసలందుకుంటున్నారు.

విరాళం చిన్నదైనా.. సాయం పెద్దది...

- పల్లెర్ల రమేష్, నీడ సంస్థ వ్యవస్థాపకుడు



సాయం చేయాలని ఉన్న ఒక్కొక్కరు రూ.100తో ఏమి కాదులే అని వెనుకడుగు వేస్తున్నారు. అలా మొదలైన ఆలోచనే వాట్సాప్ గ్రూప్ వేదికగా మారింది. సమాజం కోసం రూ.100తో సేవ చేసేందుకు రూపకల్పన చేశా. 10 మందితో ప్రారంభమై 80 మందికిపైగా భాగస్వాములై నెలకు ఒక్కొక్కరు రూ.100 విరాళం అందజేస్తున్నారు. ఆ మొత్తాన్ని నెలలో రెండుసార్లు అభాగ్యులకు అందజేస్తున్నాం.

ఫిజియోథెరపీ చేయించుకుంటున్నా...

- హాసిని



మూడు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు నడుము భాగంలో గాయమైంది. మా నాన్న గౌడ కులవృత్తితో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నా విషయం తెలుసుకున్న నీడ సంస్థ వారు ఫిజియోథెరపీ కోసం రూ.6వేలు ఆర్థిక సాయం చేశారు. ఒక నెల ఫిజియోథెరపీ చేయించుకున్నా. కొంత ప్రయోజనం పొందాను.

రోడ్డు ఆక్రమణపై చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యనగర్ రోడ్ నెంబర్ 7లో రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని సూర్యనగర్ కాలనీ వాసులు కోరుతున్నారు. సూర్యనగర్‌లో 14 సంవత్సరాల నుండి రోడ్డుపై రాక పోకలు కనసాగిస్తున్నా కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి అడ్డుగా గోడను నిర్మించారన్నారు. సూర్యనగర్ 8, 9, 10 వీధులకు వెళ్లే రోడ్డును ఆక్రమించి కందకం తీశారన్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్డుకడ్డంగా నిర్మించిన గోడను కూల్చి వేయడంతో పాటు, ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

జూడో పోటీలకు మానేరు విద్యార్థులు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పూనేలో ఈనెల 18 నుంచి 21వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్‌జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ సిలువేరు మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 57కిలోల విభాగంలో బీంగి మన్విత, 60 కిలోల విభాగంలో నిషిత్‌రెడ్డి ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యారని తెలిపారు.

ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారు అనంతరెడ్డి, డైరెక్టర్ కడారు సునితారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు జాహెద, శిరీష, తిరుపతి, స్వామి, మహేందర్ అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కరీంనగర్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తి గ్రామంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని అట్ల మల్లమ్మ జ్ఞాపకార్థకంగా క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఈకార్యక్రమంలో అట్ల అనిల్‌యాదవ్, మారం సంపత్, అంజి, యుడిస్టర్, అనిల్, మురళీ, గణేష్, చందు, సంతోష్, రమేష్, సాయి, విజయ్, శ్రీనివాస్, లక్ష్మణ్, బాలు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయంలో భిక్ష

కరీంనగర్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప దేవాలయంలో మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా ఉదయం గణపతి హోమం, స్వామివారికి ఫల రస పంచామృతాభిషేకం అనంతరం భిక్ష ఉంటుందని ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్, ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం మకరజ్యోతి ప్రత్యక్ష దర్శనం అనంతరం మహా పడిపూజ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మకర సంక్రాంతి



కరీంనగర్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన ఉత్తరాయణ పుణ్యకాలాన్ని మకర సంక్రాంతిగా పాటిస్తారు. సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరం వైపు తిరగడమే దీని ప్రత్యేకత. భోగి భోగభాగ్యాలకు, సంక్రాంతి సంపదకు, కనుమ కలిమికి చిహ్నంగా చెప్పే సంక్రాంతి మూడు రోజుల పండుగలో భాగంగా మంగళవారం సంబరాల సంక్రాంతికి, బుధవారం కనుమ పండుగకు జనం స్వాగతం పలుకనున్నారు.

మకర సంక్రమణం.. మంగళప్రదం

మకర సంక్రమణం లక్ష్మీదేవి ఆగమనానికి సంకేతంగా చెబుతారు. శ్రీమన్నారాయణుడితో కలిసి లక్ష్మీదేవి రంగుల ముగ్గుల రథాన్ని ఎక్కి వస్తుందంటారు. అందుకే ముగ్గులకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. దాన్యరూపంలో ఉన్న లక్ష్మీదేవితో పాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇళ్లకు వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని మహిళలు ఆవుపేడతో అలికి ముగ్గులు పెట్టి పసుపుకుంకుమలతో గడపను అలంకరిస్తారు.

ఘనంగా భోగి వేడుకలు

జిల్లా కేంద్రంలో భోగి పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే లేచి భోగి మంటలు వేసుకొని మంగళ స్నానాలాచరించి దైవ దర్శనం చేశారు. కొందరు సాయంత్రం భోగి మంటలు కాల్చారు. జిల్లా కేంద్రంలోని వారంతా పల్లెలకు తరలి పోగా వీధులన్ని బోసి పోయి కన్పించాయి. చిన్నారులు, యువత గాలిపటాలను ఎగరేస్తూ సందడిగా గడిపారు. జ్యోతినగర్ 59 డివిజన్‌లో కార్పొరేటర్ గందె మాధవి- మహేశ్ దంపతుల ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. పలు డివిజన్లలో, కూడళ్లలో భోగి మంటలు వేసి ఉత్సాహంగా గడిపారు.

● కరీంనగర్ రూరల్: నగునూర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ గ్రామ కన్వీనర్ పురుషోత్తం హరీష్, గ్రామ కన్వీనర్ పురుషోత్తం హరీష్, ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖులు ఆవుల అనిల్, కస్తూరి రాఘవేంద్రరెడ్డి, సాయిల మహేందర్, ఆవుల సునీల్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్: డివిజన్‌లో భోగి వేడుకలను నిర్వహించారు. హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు.

● శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● సైదాపూర్: మండలంలోని గ్రామాల్లో భోగి వేడుకలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మానకొండూర్: మండలంలోని గ్రామాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. వాకిళ్లలో ముగ్గులు వేసి నవధాన్యాలతో బొమ్మెమ్మలను పెట్టారు.



'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రవర్తన సిగ్గుచేటు'



మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సమీక్షా సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రవర్తన సిగ్గుచేటని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిధి గృహంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పట్ల కౌశిక్‌రెడ్డి దూకుడుగా ప్రవర్తించడం దుర్మార్గం అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇలాంటి సైకోలను ప్రోత్సహిస్తూ శిఖండి రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ కోరాలని ఆయన డిమాండ్ చేశారు. మీరు ఇటుకలతో కొడితే మేము రాళ్లతో కొడతాం.. మా సౌమ్యతను అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఘటన వెనుక కేసీఆర్ హస్తం'

కరీంనగర్ అర్బన్: కౌశిక్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించడం వెనక కేసీఆర్ హస్తం ఉన్నట్టు అనుమానం కలుగుతోందని సుడా చైర్మన్, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు.

'ప్రజలు కౌశిక్‌రెడ్డిని తరిమికొడతారు'

కరీంనగర్ అర్బన్: హుజూరాబాద్ ప్రజలు కౌశిక్‌రెడ్డిని తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, డీసీసీ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు సుజిత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

భగత్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బద్దిపెల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్నారెడ్డి, కొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ పిల్లిశ్రీలత మహేష్, బీజేపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి బోయినపల్లి ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కోడూరి శ్రీనివాస్, కోడూరి పరుశురాంగౌడ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెడ్పి క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నూతన సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో యువ కవి, గాయకుడు రావుల పవన్ స్మృతిలో సోమవారం తీగలగుట్టపల్లి బస్‌స్టాప్ సమీపంలోని సెయింట్‌జార్జ్ నినోస్ బ్లాక్‌లో 141వ ఎన్నీల ముచ్చట్లను నిర్వహించారు. కార్యక్రమంలో తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వేంకటేశ్వర్లు, సమన్వయకర్తలు దామరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్‌తో పాటు కందుకూరి అంజయ్య, మధుశ్రీ, రాము, చైతన్య, ప్రవీణ్‌కుమార్, రామయ్య, ఖాలిద్, అఖిల్ పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ట్రినిటి విద్యార్థిని ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని ఛత్రపతి జిల్లాలో ఈనెల 14 నుంచి 18వరకు జరిగే జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటి కళాశాల విద్యార్థిని శ్రీచరణి ఎంపికైంది. గత నెల 22, 23 తేదీలలో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన శ్రీచరణి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల పీడీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచరణిని ట్రినిటి కళాశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.



శ్రీచరణిని అభినందిస్తున్న ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి

కాట్రేవుల పండుగ



గోపాల్‌పూర్‌లో ఎడ్ల బండ్లతో ర్యాలీ తీస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులతో గ్రామం చల్లంగా ఉండాలని కోరుతూ గోపాల్‌పూర్‌లో రైతుల ఆధ్వర్యంలో సోమవారం కాట్రేవుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఎడ్ల బండ్లను అలంకరించి గ్రామంలో ఊరేగింపు చేపట్టి శ్రీ జిలుగుల మల్లికార్జున దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. గ్రామంలోని కూడలి వద్ద బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు మునీందర్ ఆధర్యంలో భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎర్రోజు సంజురెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఊరడి మంజుల, మల్లారెడ్డి, బీజేపీ నాయకులు ఊరడి శివారెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెల్పుల నారాయణ, శ్రీకృష్ణ ఆలయ చైర్మన్ గోనె ఎల్లారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మంద రాజమల్లు, అనుమల్ల తిరుపతి పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



పొంగలి వండుతున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నగరంలోని హరితహారం ఆవరణలో కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, పొంగలి ప్రసాద వితరణ, హరిదాసు వేషధారణ, గాలిపటాలు ఎగురవేయడం, బసవన్నల విన్యాసాలు, ఎడ్ల బండ్లు, ఆటలు పాటలతో ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్యాంసుందర్, బీఎస్‌రావు, భాగ్యరెడ్డి, తిరుపతిరావు, పోలాడి శ్రీనివాస్‌రావు, మోహన్‌రెడ్డి, శ్రీలత, ఎంఎల్ఎన్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, మమత, రమణారెడ్డి, అలీం, ప్రశాంత్, పబ్బ కైలాస్, రాంకిరణ్, మాధవి, ఎనమల్ల నరేష్, ఎనమల్ల శ్రీదేవి, రత్నమంజరి, రజని, వెంకటేశ్వర్లు, దీపిక, చైతన్యరెడ్డి, ఝాన్సీ, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సిద్దారి శ్రీనివాస్, విద్య, నవీన, రవికాంత్, శేషశైలజ, ఓంప్రసాద్, హరిత, ప్రియాంక, వర్షి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజనసంఘం ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, మహిళ సంఘం ఆధ్వర్యంలో వైశ్యభవన్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగిమంటలు నిర్వహించి విజేతలకు నగరంలోని కామాక్షి ఆసుపత్రి అధినేత డాక్టర్ మనోజ్‌కుమార్ బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, వైశ్యసేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ చైర్మెన్ చిట్టుమల్ల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు జీడిగే సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆకుల మెహర్, కోశాధికారి అమరేందర్, జిల్లా మహిళ అధ్యక్షురాలు చకిలం స్వప్న పాల్గొన్నారు.

'వేయిగొంతుకలు, లక్ష డప్పులు' సన్నాహక కార్యక్రమం

భగత్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలో వేయి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. జానపద కళాకారుడు రామంచ భరత్ ఆధ్వర్యంలో రథయాత్ర గ్రామానికి చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకులు రేణిగుంట సాగర్, కొత్తూరు రాజన్న, దావ ప్రభాకర్, ఓరుగంటి సంతోష్, దావదుర్గమల్లు నర్సయ్య, కొట్టేపల్లి రాజారాం, భూమ రాజయ్య, దావ కరుణాకర్, దావ నారాయణ, ఓరుగంటి లచ్చయ్య, కడపల రాజయ్య, ఓరుగంటి నర్సయ్య, ఓరిగంటి శంకర్ పాల్గొన్నారు.

గురుకులాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

జమ్మికుంట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గురుకులాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురుకులాల ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గురుకులాల్లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్ ఐలయ్య మాట్లాడుతూ ప్రవేశాలు పొందేందుకు జనన, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జతపరిచి గురుకులాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, రజనీకర్, పేరేంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకొండకు బయలుదేరిన ఎడ్లబండ్లు

శంకరపట్నం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేట గ్రామం నుంచి హనుమకొండ జిల్లాలో నిర్వహించే కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి జాతరకు ఎడ్లబండ్లు ఊరేగింపుగా బయలుదేరాయి. గ్రామంలో అంతకి రాజయ్య కుటుంబ సభ్యులు ఆనవాయితీగా ప్రతి సంవత్సరం ఎడ్లబండ్లను కట్టుకొని ఊరేగింపుగా భోగి నాడు కొత్తకొండకు బయలుదేరుతారు. ఈ క్రమంలో గ్రామస్థులు ఎడ్లబండ్ల వద్దకు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అంకతి భద్రయ్య, అంకతి కనకయ్య, అంకతి అయిలయ్య, వనపర్తి అయిలయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

తిమ్మాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని తిమ్మాపూర్ సిఐ కెస్వామి అన్నారు. మండలంలోని రామకృష్ణకాలనీలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యువత గంజాయి, మద్యంతో పాటుగా సోషల్ మీడియాకు అలవాటై విలువైన సమయాన్ని, జీవితాలను కోల్పోతున్నారని అన్నారు, క్రీడలను ప్రోత్సహించే వివిధ పార్టీలకు చెందిన నాయకులకు సిఐ స్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎండి ఎస్సై వివేక్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

హుజూరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పట్ల అసభ్యకరంగా మాట్లాడి, దాడి చేయడాన్ని ఖండి స్తూ సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ ఆదేశాల మేరకు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల మేకల తిరుపతి, కొల్లూరి కిరణ్, కొలిపాక శంకర్, పుష్పలత, లావణ్య, కిరణ్‌రెడ్డి, సదానందం, అప్సర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఉపసంహరించుకోవాలి: సుంకె రవిశంకర్

గంగాధర, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో పోలీసులు పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు లాక్కెలుతుంటే ముగ్గురు మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే కేసులు ఉపసంహరించుకోవాని లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్నది ప్రజా పాలన కాదు పోలీసు పాలన అని అన్నారు. ఆరు గ్యారంజీలు అమలు చేయడం చేతగాక కేసులతో ప్రతిపక్ష నేతలను గొతు నొక్కుతున్నారని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏతప్పు చేయలేదన్నారు. కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసులు బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

హుజూరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లూరి రాహుల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కిరణ్, తౌసీఫ్, పుష్పలత, సుశీల, అప్సర్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రజల పరువు తీస్తున్న కౌశిక్‌రెడ్డి : వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల పరువు తీస్తున్నాడని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోటి ఎమ్మెల్యే అయిన సంజయ్‌కుమార్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పార్టీ ఫిరాయింపులపై గగ్గోలు పెట్టే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లింది నిజం కాదా అని ప్రశ్నించారు. కుటుంబంతో చనిపోతానని బెదిరించడం వల్లనే ఓట్లు వేశారే తప్ప అతనిపై ప్రేమ ఉండి ఎవరూ ఓటు వేయలేదని తెలిపారు. హుజూరాబాద్ నుంచి గతంలో ఎన్నికైనా ప్రతి ఒక్కరూ కౌశిక్‌రెడ్డి లాగా వ్యవహరించలేదని పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి చర్యల వల్ల హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రావడం లేదన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి సోషల్ మీడియాలో హైలెట్ కావాలని కౌశిక్‌రెడ్డి చూస్తున్నారని పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు భేషరతుగా కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నారన్నారు.



హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

భద్రత నియమాలు పాటించాలి

శంకరపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి తాడికల్‌లో రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

తిమ్మాపూర్‌లో క్రికెట్ పోటీలు

తిమ్మాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ వయసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాంతమ్మ, మల్లయ్య స్మారకార్థం నాయకులు మాతంగి శంకర్ ప్రిమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను సోమవారం ఎల్ఎండీ ఎస్సై తండ్ర వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉల్లాసం , ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు మాతంగి శంకర్, మాజీ సర్పంచ్ దుండ్ర రా.జయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు పోలు రాము, రమేష్, బొర్ర వంశీ, చిలుకూరు అనిల్, పోతురాజు దేవేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో సోమవారం జరిగిన గోదారంగనాథస్వామి కల్యాణంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఉప కులపతి శ్రీభాష్యం వరప్రసాద్, ప్రముఖ పండితుడు సాతులూరి గోపాలకృష్ణమాచార్య స్వామి పాల్గొన్నారు. మార్కెట్ రోడ్ వేంకటేశ్వరాలయంలో జరిగిన కల్యాణంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

● నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పిట్టల శ్రీనివాస్, ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: కొత్తపల్లిలోని శ్రీ సీతారాముల వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు భైరి శ్రీనివాస్ స్వామి, రామాచారి ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య గోదారంగనాయకుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో సోమవారం శ్రీగోదారంగనాథుల స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రహ్మ ఋలైన ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకులు శేషం వంశీధరాచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామాచార్యుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, భక్తులు సురేందర్‌రెడ్డి, పెద్దికుమార్, గణపతిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రినగర్‌లో గల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు.

● సైదాపూర్: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో గల వెంకటేశ్వర ఆలయంలో శ్రీ గోదారంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో వేదపండితులు లక్ష్మీనరహరిచార్యులు, సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలోని జీయార్‌స్వామి మఠంలో గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం సోమవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హుజూరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ప్రాంత రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని మాట్లాడడం సరి కాదన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి రైతాంగాన్ని గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొల్లూరి కిరణ్, మేకల తిరుపతి, డైరెక్టర్లు సదానందం, కిరణ్‌రెడ్డి, బిక్షపతి, చాంద్‌పాషా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శంకరపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య సోమవారం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కార్యకర్తలతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, తిరుపతిరెడ్డి, తిరుపతి, కుమారస్వామి, సాంబయ్య, పోచయ్య, రమేష్, మహేష్, సుదర్శన్, చారి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

తిమ్మాపూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో కాలువకు గండిపడిన సంఘటనలో బాధిత కుటుంబాలకు సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎల్.గౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర కనకయ్య గౌడ్, జేజల సంపత్, గుంటి శ్రీనివాస్, పోట్ట శ్రీనివాస్, పోతుగంటి శ్రీనివాస్, తాళ్లపల్లి కొమురయ్య, ఎండి జాఫర్, రావుల కృష్ణ గౌడ్, గుంటి మదుకర్, పారునంది మల్లేశం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ జగన్నాథంకు నివాళి

హుజూరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం మాజీ ఎంపీ మంద జగన్నాథం చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో రామచంద్రం, వసంత్, వెంకటరాజం, రత్నం, శేఖర్ పాల్గొన్నారు.